క్లుప్తంగా

నేడు విద్యుత్ నిలిపివేత

ఫిరంగిపురం: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గురువారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పుల్లారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిరంగిపురం, గొల్లపాలెం, రేపూడి, వేమవరం, 113.తాళ్లూరు, శిరంగిపాలెం తక్కెళ్లపాడు, గరుడాచలపాలెం గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీసీజీ వ్యాక్సిన్‌పై అవగాహన

ఫిరంగిపురం: బీసీజీ వ్యాక్సిన్‌పై ఆరోగ్య సిబ్బందికి ఫిరంగిపురంలోని అర్బన్ హెల్త్‌సెంటర్‌లో వీడియో కాన్ఫరెన్స్ బుధవారం నిర్వహించారు. టీబీ జాయింట్ డైరెక్టర్ తాళ్లూరు రమేష్ మాట్లాడుతూ ఏఏ వయస్సు వారికి టీబీ వ్యాక్సిన్ వేయాలో వివరించారు. షుగర్ బాధితులు, 60 ఏళ్లకు పైబడినవారు, గతంలో టీబీ సోకి చికిత్స పొందుతున్నవారు, వారితో పాటు వారి ఇంటిలోని వారు, 18 కిలోల కన్నా తక్కువ ఉన్నవారు, బీడీ , సిగిరెట్లు అలవాట్లు ఉన్నవారు బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవచ్చని చెప్పారు. అదే విధంగా 18 ఏళ్లలోపు ఉన్నవారు, హెచ్ఐవీ బాధితులు, గర్భిణులు, గుండె సంబంధిత చికిత్స పొందుతున్నవారు, కేన్సర్ బాధితులు, జ్వరం వస్తున్నవారు, రక్తదానం మూడు నెలల కిందట చేసినవారు దీనికి అనర్హులుగా తెలిపారు. కార్యక్రమంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ, నుదురుపాడు పీహెచ్‌సీ వైద్యులు యానీగ్రేస్, ఎస్తేరురాణి, శ్వేత, ఫరీనాబేగంలు, సీహెచ్ఓలు వెంకటలక్ష్మి, వెంకటరమణ, పీహెచ్ఎన్ గాయత్రీదేవి, హెచ్‌వీలు నూర్‌న్నీసా, అన్నమేరి పాల్గొన్నారు.

213 మందికి వైద్యపరీక్షలు



ఫిరంగిపురం: మండలంలోని గరుడాచలపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా బుధవారం ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. గుంటూరు నుంచి వచ్చిన వైద్యుడు 213 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. వేసవిలో వడదెబ్బతగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. చలివేంద్రాలు వద్ద, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వడదెబ్బ తగిలిన వారు ఓఆర్ఎస్ నీటిలో కలుపుకొని తాగాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎం స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్‌గా లక్ష్మణ్



మంగళగిరి: మండలంలోని నీరుకొండలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ నూతన స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్‌గా కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ ఫైనల్ బీవీఎస్ లక్ష్మణ్ ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం యూనివర్సిటీ ఆడిటోరియంలో 2024–25 విద్యాసంవత్సరానికి నూతన కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా లక్ష్మణ్, వైస్ ప్రెసిడెంట్‌గా సీఎస్ఈ మూడో సంవత్సరం విద్యార్థి నివేదా శ్రీరామ్, ప్రధాన కార్యదర్శిగా వేముల అంకితరెడ్డి, కోశాధికారిగా రిషబ్ రంజన్లు ఎన్నికై నట్లు తెలిపారు. ఏడాది కాలం పాటు కౌన్సిల్ కొనసాగుతుంది. ఇప్పటి వరకు కొనసాగిన కౌన్సిల్ నూతన కౌన్సిల్‌కు బాధ్యతలు అప్పగించగా పరిచయ కార్యక్రమంలో వీసీ డాక్టర్ మనోజ్ ఆరోరా, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్‌కుమార్, కమ్యూనికేషన్ డైరెక్టర్ పంకజ్, సీఎఫ్ఏఓ సుమ, డీన్ డాక్టర్ భరద్వాజ్ హాజరై నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం



తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో తాడేపల్లి పట్టణ పరిధిలోని అమరావతి ఐకాన్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం నుంచి వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. కమిటీ రాష్ట్ర కన్వీనర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఈనెల 31వ తేదీ వరకు విద్యార్థులకు లెక్కలు, డ్యాన్స్‌లలో శిక్షణ ఇస్తున్నామని, ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు లెక్కలు, 11 నుంచి 12.30 వరకు డ్యాన్స్‌లో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. డాక్టర్ ఎస్. లెనిన్ బాబు, ప్రఖ్యాత డ్యాన్స్ మాస్టర్ చందు శిక్షణ ఇస్తున్నారని, 5,6,7 తరగతులు జూనియర్స్, 8,9,10 తరగతులు సీనియర్స్‌గా విభాగాల్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, నిర్వాహకులు కల్యాణి, జి.రమ్య, సంధ్యారాణి, ఐజాక్ నూటన్ పాల్గొన్నారు.

లావణ్య విజయం తథ్యం..

లోకేష్‌కు రెండోసారి పరాభవం తప్పదంటున్న పరిశీలకులు



ఓటింగ్‌లో బారులు తీరిన ఓటర్లు(ఫైల్)

మంగళగిరి: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య విజయం తథ్యమని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. లావణ్య తల్లి మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, మామయ్య మాజీ మంత్రి మురుగుడు హనుమంతరావులకు పట్టణంలో భారీగా బంధువర్గం ఉండగా వారితో పాటు చేనేత సామాజిక వర్గం అంతా లావణ్యకు అండగా నిలవడంతో గెలుపుపై భారీగా అంచనాలు పెరిగాయి. 2019 ఎన్నికలలో నియోజకవర్గం నుంచి అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)పై టీడీపీ హయాంలో మంత్రిగా ఉన్న నారా లోకేష్ పోటీ చేసి 5,700 ఓట్ల తేడాతో ఓడిపోయారు. మళ్లీ నారా లోకేష్ మంగళగిరి నుంచే తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రంగంలోకి దిగారు. వైఎస్సార్ సీపీ చేనేత సామాజిక వర్గం అధికంగా ఉన్న మంగళగిరిని ఆ సామాజిక వర్గానికి చెందిన లావణ్యను అనూహ్యంగా రంగంలోకి దింపింది. అంతేకాక ఎమ్మెల్యే ఆర్కే తన వ్యూహరచనతో లావణ్య విజయానికి కృషి చేశారు. 2019 ఎన్నికలలో తాడేపల్లి పట్టణం, మండలం వైఎస్సార్ సీపీకి అండగా నిలవగా 10,400 ఓట్లకుపైగా మెజార్టీ వైఎస్సార్ సీపీకి దక్కింది. అయితే మంగళగిరి మండలం, పట్టణం అనూహ్యంగా టీడీపీకి అండగా నిలవగా దుగ్గిరాల మండలం వైఎస్సార్ సీపీకి అండగా నిలవడంతో ఎమ్మెల్యే ఆర్కే 5,700 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈనెల 13వ తేదీన నిర్వహించిన 2024 ఎన్నికలలో పోలింగ్ సరళిని పరిశీలిస్తే తాడేపల్లిలో కొంతమేర వైఎస్సార్ సీపీకి మెజార్టీ తగ్గే అవకాశముందన్న చర్చ జరుగుతుంది. అయితే అనూహ్యంగా మంగళగిరి మండలం, పట్టణంలో వైఎస్సార్ సీపీకి దక్కే అవకాశముండగా దుగ్గిరాల మండలం వైఎస్సార్ సీపీ వైపే మొగ్గు చూపడంతో లావణ్య విజయం తథమని, లోకేష్‌కు రెండోసారి పరాభవం తప్పదని నియోజకవర్గ ప్రజలలో జోరుగా చర్చ జరుగుతుంది.

నియోజకవర్గంలో మొత్తం 2,92,432 మంది ఓటర్లుండగా పురుషులు 1,21,039 మంది ఓటు హక్కు వినియోగించుకోగా మహిళలు 1,29,693 మంది ఇతరులు 7గురు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషుల కంటే మహిళలు అదనంగా 8,654 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో మహిళల ఓట్లు పెరగడం లావణ్య విజయానికి కలిసి వస్తుందని వైఎస్సార్ సీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళల కొరకు ప్రవేశపెట్టిన అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ పెన్షన్‌లతో వైఎస్సార్ నేతన్న నేస్తం అనేక పథకాలు కొనసాగాలంటే మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలనే మహిళలు భారీగా తరలివచ్చి గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి ఓట్లు వేశారనే చర్చ జరుగుతుంది. ఐదు సంవత్సరాలలో జరిగిన చేనేత పరిశ్రమ అభివృద్ధి, చేనేత భవనం, మగ్గాల షెడ్ల నిర్మాణం ఇలా అన్ని చేనేత సామాజికవర్గం వైఎస్సార్ సీపీకి అండగా నిలిచేందుకు సహకరించాయని దీంతో లావణ్య విజయం ఖాయమని ఆ ఆపార్టీ నాయకులు జోష్ మీద ఉన్నారు. గత ఎన్నికలలో ఓడిపోయిన లోకేష్ ప్రచారం నిర్వహించకపోయినా వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా లోకల్ కాదని గెలిస్తే అందుబాటులో ఉండడని అందువలనే ఓటర్లు లావణ్య వైపు మొగ్గు చూపారని పరిశీలకు అంచనా వేస్తున్నారు.

స్వల్పంగా పెరిగిన ఓటింగ్

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గంలో గతంలో కన్నా ఓటుహక్కు వినియోగించుకున్న వారి శాతం స్వల్పంగా పెరిగింది. మంగళగిరి నియోజకవర్గంలో 2019–2024కు కేవలం 0.29 శాతం మాత్రమే పెరిగింది. 2019 ఎన్నికల్లో మొత్తం 2,28,469 ఓట్లు పోల్ కాగా, నియోజకవర్గ వ్యాప్తంగా 85.45 శాతం నమోదు అయింది. 2024లో 2,50,542 ఓట్లు పోల్ కాగా, 85.74 శాతం మాత్రమే నమోదు అయింది. ఇదిలా ఉండగా మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటి వరకు జరిగిన పోలింగ్‌లో ఓట్ల శాతం ఈ విధంగా ఉంది. 2014లో 89.48 శాతం, 2009లో 80.55, 2004లో 72.45 శాతం, 1999లో 66.21 శాతం, 1994లో 70.24 శాతం, 1989లో 71.27, 1985లో 74.81, 1983లో 70.31శాతం, 1978లో 77.45, 1972లో 71.15, 1967లో 76.83, 1962లో 73.36, 1955లో 74.03, 1952లో 71.16 శాతం నమోదు అయింది. ఎప్పుడు ఎన్నికలు జరిగినా మంగళగిరి నియోజకవర్గంలో ప్రజలు తమ ఓటు హక్కును 70 శాతం మంది పైగానే వినియోగించుకున్నారు. గత ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగినప్పుడల్లా వైఎస్సార్ సీపీయే విజయం సాధించింది. తిరిగి మరల వైఎస్సార్ సీపీయే విజయం సాధిస్తుందని వైఎస్సార్ సీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

వృద్ధాశ్రమానికి వృద్ధురాలి తరలింపు



మతిస్థిమితం లేని వృద్ధురాలిని వృద్ధాశ్రమానికి తరలిస్తున్న జాగృత భారత్ ట్రస్ట్ నిర్వాహకులు

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం దుగ్గిరాల గ్రామంలో ఓ వృద్ధురాలు శివాలయం సెంటర్ బస్టాండ్ వద్ద ఉండడంతో స్థానికులు జాగృత భారత్ ట్రస్ట్ సభ్యులకు బుధవారం సమాచారం అందించారు. ఈ సందర్భంగా జాగృత భారత్ ట్రస్ట్ ఫౌండర్ పసుపులేటి గణేష్ మాట్లాడుతూ గత 15 రోజుల నుండి వృద్ధురాలు బస్టాండ్ ఆవరణలో నివాసం ఉంటోందని, కుడిచేతికి గాయం కావడంతో బాధపడుతూ ఉందని, ఆమెకు మతిస్థిమితం లేనట్లు గుర్తించామని, ఆమె పేరు కూడా చెప్పే పరిస్థితిలో లేదని, ఆ వృద్ధురాలిని విజయవాడలోని వృద్ధాశ్రమానికి పంపించామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఆరమండల సుధాకర్, అడపా వెంకటరావు, ఎద్దు సిద్ధూ పాల్గొన్నారు.

ప్రవాసాంధ్రుల సాయంతో విప్ర సేవ



నిత్యావసరాలు అందుకుంటున్న అర్చకులు

తెనాలి రూరల్: ప్రవాస ఆంధ్రుల సహకారంతో మండలంలోని కొలకలూరు గ్రామంలో రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి ఆలయ కళ్యాణ మండప ప్రాంగణంలో విప్ర సేవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. నెల్లూరు జిల్లాకు చెందిన ప్రవాసాంధ్రులు చిట్టమూరు రుక్మిణమ్మ, రామిరెడ్డి మధు కిరణ్‌రెడ్డిల ఆర్థిక సహకారంతో నిర్వహించిన కార్యక్రమానికి సీతారామ ధార్మిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు దీవి అనంతబాబు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర అర్చక సమాఖ్య ఆర్గనైజింగ్ సెక్రటరీ టి. అనంత ఆచార్యులు మాట్లాడుతూ పేద బ్రాహ్మణులకు అనేక రకాలుగా సహాయ సహకారాలు అందించి వారి కుటుంబాలకు భరోసాగా నిలుస్తున్న ప్రవాసాంధుల సేవలు అభినందినీయమన్నారు. ఆధ్యాత్మిక ప్రచారకర్త ప్రముఖ ఆగమపండితులు దీవి వికనస ఆచార్య స్వామి మాట్లాడుతూ నేటి సమాజంలో లోక హితాన్ని పురోహితాన్ని కోరుకుంటూ భగవత్ సేవలో జీవితాలను వెళ్లబుచ్చుతున్న బ్రాహ్మణ జాతికి సేవలందిస్తున్న ధార్మిక సంస్థ ఆలోచనలు పుణ్యప్రదమన్నారు. కార్యక్రమంలో ప్రవాస భారతీయులు పండిత దీవి లక్ష్మీ నరసింహా చార్యులు, చెన్నకేశవ స్వామి ఆలయ అర్చకులు దీవి సీతారామాచార్యులు, ఆధ్యాత్మిక ప్రవచన కారిణి దీవి లావణ్య, వైఖానస సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ మేడూరి శ్రీనివాసమూర్తి, వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధని సభ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్ వేణుగోపాల్, వైఖానస నవరక్ష వాహిని అధ్యక్షులు రత్నాకరం రామ మనోహర్, బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు రామగోపాల్, వైఖానస సేవా సంఘం ఉపాధ్యక్షుడు హరిబాబు, అర్చకులు దీవి శ్రీనివాస వరప్రసాద్, డాక్టర్ దీవి శ్రీనివాస్, డాక్టర్ మురళీకృష్ణ, రఘురామాచార్యులు, దీవి శ్రీమాన్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా 45 మంది పేద బ్రాహ్మణ కుటుంబాలకు రూ. 1.50 లక్షల విలువ చేసే నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.

బండ్లమ్మ వార్షిక తిరునాళ్ల ప్రారంభం

- ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు
- పలుచోట్ల ప్రారంభం కానున్న గ్రామ దేవతల తిరునాళ్ల
- ఓలేరు తిరునాళ్లకు తరలి రానున్న భక్తజనం



ప్రత్యేక అలంకారంలో బండ్లమ్మవారు

చందోలు(పిట్టలవానిపాలెం): మండలంలోని చందోలులో వేంచేసి యున్న బగళాముఖి (బండ్లమ్మ) అమ్మవారి వార్షిక తిరునాళ్ల బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మవారిని పలు రకాల పుష్ప మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రాతఃకాలంలో అమ్మవారికి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో అమ్మవారి దేవాలయం కిటకిటలాడింది. ఉదయం 9 గంటలకు అఖండ జ్యోతితో అమ్మవారి తిరునాళ్లకు శ్రీకారం చుట్టారు. అమ్మవారి ఘటాలను చెరుకుపల్లి మండలం కుంచల వారిపాలెం గ్రామానికి గ్రామోత్సవం నిమిత్తం కనకతప్పెట్లు, బ్యాండు మేళాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

22న ఓలేరు ఓలేటమ్మ తిరునాళ్ల

ఓలేరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఓలేరు గ్రామంలో వేంచేసియున్న ఓలేటమ్మ తిరునాళ్ల మహోత్సవాలు 22న ఘనంగా నిర్వహించనున్నారు. ఏటా గ్రామస్తులు అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకోవటం ఇక్కడ ఆనవాయితీ వస్తోంది. అమ్మవారి సన్నిధికి వెంకట్రాజునగర్, ఓలేరు నుంచి ప్రభలు వస్తాయి. ఓలేరు గొడపాలెం నుంచి చిన్నారులు ప్రభను కట్టుకుని అమ్మవారి సన్నిధికి తీసుకురావడం సంప్రదాయంగా కొనసాగుతోంది. పూజా కార్యక్రమాలతో పాటు తిరునాళ్లనుఅత్యంత వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకుడు బీతపూడి రజనీకాంత్ కృషి చేస్తున్నారు.

23న గొరిగపూడిలో దేశమ్మ తిరునాళ్ల

గొరిగపూడి(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం గొరిగపూడి గ్రామ దేవత దేశమ్మతల్లి తిరునాళ్ల 23న అత్యంత వైభవంగా జరుగనుంది. ప్రతి ఏడాది వైశాఖ శుద్ధ పౌర్ణమి పర్వదినాన అమ్మవారి తిరునాళ్ల నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. దేశమ్మ తల్లి ఆలయానికి ఎంతో పురాతన చరిత్ర ఉంది. సుమారు 230 సంవత్సరాల క్రితం నిర్మితమైనట్లు పెద్దలు చెబుతున్నారు. తిరునాళ్ల పురస్కరించుకుని ఆ రోజున అమ్మవారికి పసుపు, కుంకుమలు, చద్ది నైవేద్యాలు సమర్పించుకుంటారు. రాత్రికి భక్తులు, గ్రామస్తులు, ప్రజలు ఆకర్షణతో కూడిన ప్రభలను ఏర్పాటు చేసి అమ్మవారి తిరునాళ్లను వైభవంగా జరుపుకుంటారు. అమ్మవారి దేవాలయాన్ని పదేళ్ల క్రితం పునర్నిర్మాణం చేసి అత్యంత వైభవంగా తీర్చిదిద్దారు.

కృష్ణానదిలో గుర్తుతెలియని మృతదేహం

తాడేపల్లిరూరల్: ప్రకాశం బ్యారేజ్ కృష్ణానది ఎగువ ప్రాంతంలో నీటిలో మృతదేహం ఉన్నట్లు బుధవారం సాయంత్రం తాడేపల్లి పోలీసులకు మత్స్యకారులు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ రమేష్ ఘటనా స్థలానికి వెళ్లి కృష్ణానది ప్రకాశం బ్యారేజ్ 6వ గేట్ వద్ద ఉన్న వ్యక్తి మృతదేహాన్ని బయటకు తీయించి పరిశీలించారు. మృతుడి వద్ద ఎటువంటి గుర్తింపు కార్డులు లేకపోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. మృతుడు తెల్లచొక్కా, బ్లూ జీన్స్ ధరించి ఉన్నాడని, ఎవరైనా మృతదేహాన్ని గుర్తిస్తే తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

రైల్వే ఉద్యోగిపై దాడి



గాయపడిన హుస్సేన్

తాడేపల్లి రూరల్: రైల్వే ఉద్యోగిపై ముగ్గురు వ్యక్తులు దాడిచేశారు. ఈ నగరపాలక సంస్థ పరిధిలోని వైఎస్సార్ సెంటర్ పశువుల ఆసుపత్రి వద్ద ఉన్న బకింగ్ హామ్ బ్రిడ్జి దిగువ ప్రాంతంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. తాడేపల్లి కృష్ణాకెనాల్ జంక్షన్ టీఆర్‌డీ డిపార్టుమెంట్‌లో బలమాల హుస్సేన్ పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని బైపాస్ రోడ్డులో వెళుతుండగా వైఎస్సార్ సెంటర్ పశువుల ఆసుపత్రి దిగువ ప్రాంతంలో బకింగ్‌హామ్ బ్రిడ్జిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. ద్విచక్ర వాహనం ఆపి నిలబడ్డాడు. ఇదే సమయంలో ఎదురుగా మహిళలు ఉండటంతో మరో వాహనం పక్కకు తీయాలని హుస్సేన్ కోరాడు. అటువైపు నుంచి నడుచుకుంటూ వస్తున్న ముగ్గురు యువకులు ఏంట్రా నువ్వు మాకు చెప్పేదంటూ హుస్సేన్‌తో గొడవకు దిగారు. మిమ్మల్ని కాదని అంటున్నా వినకుండా సిమెంట్ రేకుతో బలంగా తలపై మోదడంతో గాయమైంది. వెంటనే ముగ్గురు అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న తోటి రైల్వే ఉద్యోగులు హడావుడిగా ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రుడిని విజయవాడ రైల్వే ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

ఇక పురసేవలపై నిమగ్నం

కమిషనర్ బండి శేషన్న

తెనాలి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో మున్సిపల్ సిబ్బంది అందరూ యథావిధిగా తమ తమ విధుల్లో పూర్తిస్థాయిలో నిమగ్నమవుతారని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. ప్రజలు ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావొచ్చని చెప్పారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో కమిషనర్ శేషన్న బుధవారం మీడియాతో మాట్లాడారు. గత కొద్ది రోజులుగా సార్వత్రిక ఎన్నికల విధుల్లో నిమగ్నమైన సిబ్బంది, ఇకపై పుర సేవలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రధానంగా పారిశుద్ధ్యంపై దృష్టిని సారించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామని చెప్పారు.

నేటి నుంచి వాసవీ అమ్మవారి జన్మదిన వేడుకలు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఆర్యవైశ్య ప్రముఖులు

తెనాలి: శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదినోత్సవ వేడుకలను గురువారం నుంచి ఘనంగా నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలు, ప్రత్యేక పూజలకు సంబంధించిన ఆహ్వానపత్రికను నిర్వాహకులు బుధవారం స్థానిక బోసురోడ్డులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థాన ప్రాంగణంలో ఆవిష్కరించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, వుప్పల వరదరాజులు, ఆలయ అర్చకులు నుదురుపాటి రామకోటేశ్వర శర్మ వివరాలను తెలియజేశారు. తొలిరోజైన గురువారం ఉదయం సుప్రభాత సేవ, వైశ్య పతాక ఆవిష్కరణ, వాసవీ అమ్మవారి మూలమూర్తికి దుర్గాదేవి అలంకారంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. మూడు రోజులు విశేష పూజలు, ప్రతిరోజు సాయంత్రం 5.30 గంటలకు సామూహిక లలితా సహస్రనామ పారాయణం ఉంటాయని చెప్పారు. అమ్మవారి భక్తులందరూ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మద్దాళి శేషాచలం, గొడవర్తి సాయి హరేరామ్, నూకల భాస్కరరావు, ఆకి అచ్చుతరావు, గోపు రామకష్ణ, గ్రంధి విశ్వేశ్వరరావు, కొణిజేటి శంకరరావు, అన్నవరపు నరసింహారావు పాల్గొన్నారు.

● శిశిరంలో మోడువారి వసంతంలో చిగురించింది!



శిశిరం ఆవహిస్తే ఎవరి జీవితాలైనా ఇంతే. చెట్లకయితే ఆకులు రాల్తాయి. మనుషులకైతే తెలియని ఆవేదన ఆవహిస్తుంది. మళ్లీ కొద్దిరోజులకే వచ్చే వసంత ఋతువు కొత్త ఆశలను మోసుకొచ్చి మనిషిగా మళ్లీ తీర్చిదిద్దుతుంది. చెట్లకయితే కొత్త చిగురులు వేయించి.. కొన్నాళ్లకు సరికొత్త ఆకులతో నిండుగా కనిపించేలా చేస్తుంది. ఇదే ఆవిష్కృతమైంది.. పట్టణంలోని బోసురోడ్డులోగల (టౌన్‌చర్చికి ఎదురుగా) మూడు దశాబ్దాల వయసున్న రావి చెట్టు పరిస్థితి ఇదే. గతనెల 14న చెట్ల ఆకులు రాలిపోయి నిర్జీవంగా కనిపించింది. మళ్లీ నెల రోజులకు మెల్లగా చెట్ల కొమ్మలు చిగురించి రోజుల వ్యవధిలోనే ఆకులు పూర్తి స్వరూపాన్ని సంతరించుకున్నాయి. ఇప్పుడు చెట్టంతా పచ్చని ఆకులతో కళకళలాడుతున్న దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది. ఎంతైనా, ఉడతను పెంచితే పారిపోతుంది.. అలాగే చిలుకను పెంచినా ఎగిరిపోతుంది.. కానీ చెట్టును పెంచితే ఆ రెండూ దానిమీదకు వచ్చి చేర్తాయన్నది వాస్తవమన్నది ఇలాటి దృశ్యాలను చూసినప్పుడు వాస్తవమనిపిస్తుంది. – తెనాలి

బుద్ధవనంలో పర్యాటక ప్రత్యేక ఆకర్షణలు

అంతర్జాతీయ బౌద్ధ సదస్సులో డాక్టర్ శివనాగిరెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి

తెనాలి: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ వద్ద తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'బుద్ధవనం –వారసత్వ ఉద్యానవనం' ఆసియా దేశాల్లోనూ విలక్షణ బౌద్ధ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందినట్టు ప్రముఖ స్థపతి, బుద్ధవనం బుద్ధిస్ట్ ఎక్స్‌పర్ట్ కన్సల్టెంట్ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి చెప్పారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని సిలిగురిలో అసోసియేషన్ ఆఫ్ బుద్ధిస్ట్ టూర్ ఆపరేటర్స్, బంగ్లాదేశ్, భూటాన్, ఇండియా, నేపాల్, మయన్మార్ దేశాల పర్యాటక నిర్వాహక సమాఖ్య సంయుక్తంగా మంగళవారం అక్కడి హోటల్ హైల్యాండ్‌లో 'ప్రమోషన్ ఆఫ్ బుద్ధిస్ట సెక్టార్స్ త్రూ ఆసియా హైవే'పేరుతో అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక సదస్సును నిర్వహించాయి. డాక్టర్ శివనాగిరెడ్డి ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరయ్యారు. పశ్చిమబెంగాల్, వివిధ ఆసియా దేశాల పర్యాటక ప్రతినిధులు పాల్గొన్న సదస్సులో ఆయన మాట్లాడుతూ తెలంగాణ పర్యాటక శాఖ 274 ఎకరాల్లో బుద్ధ చరితవనం, జాతకవనం, ధ్యానవనం, స్థూపవనం, మహాస్థూపంతో సహా తీర్చిదిద్దిన పలు బౌద్ధ పర్యాటకార్షణల గురించి వివరించారు. ఇప్పటికే అధికసంఖ్యలో బౌద్ధ పర్యాటకులను ఆకర్షిస్తున్న బుద్ధవనాన్ని ఆసియా హైవేకి అనుసంధించాలని సదస్సు నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ గౌరవ కార్యదర్శి మల్లేపల్లి లక్ష్మయ్య, ప్రముఖ సంపాదకుడు కె.రామచంద్రమూర్తి, బౌద్ధ అభిమాని కేకే రాజా, ఆలిండియా పురాతన దేవాలయాల జీర్ణోద్ధరణ సమితి అధ్యక్షుడు ఆర్కే జైన్ కూడా ఈ సదస్సులో పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై తాత్సారం వద్దు

కొల్లూరు: వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారంపై యంత్రాంగం దృష్టి కేంద్రీకరించక పోవడంపై ఎంపీటీసీ సభ్యులు ధ్వజమెత్తారు. బుధవారం కొల్లూరు మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మండలంలోని సమస్యల పరిష్కారంపై ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్య ధోరణిపై సభ్యులు ప్రశ్నించారు. వేసవి ప్రారంభం నుంచి మండలంలోని పలు గ్రామాలలో మంచినీటి సమస్య తలెత్తి ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నా తాగునీటి పంపులు ఏర్పాటు చేయకపోవడంపై ఎంపీడీఓ లక్ష్మీకుమారిని నిలదీశారు. దీనిపై ఆమె పంచాయతీ కార్యదర్శులను వివరణ కోరగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో పంపులు ఏర్పాటు చేయలేకపోయామని బదులివ్వడంతో ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య విషయంలో జిల్లా కలెక్టర్ అనుమతితో సమస్య పరిష్కారానికి పంపులు ఏర్పా టు చేసే అవకాశం ఉన్నా తాత్సారం చేయడం కారణంగా గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణం సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత సర్వసభ్య సమావేశం నిర్వహించిన సమయంలోనే కొన్ని ప్రాంతాలలో తాగునీటి పంపుల నిర్మాణాలు చేపట్టాలని తీర్మానం చేసే సమయానికి ఎన్నికల కోడ్ అమలులోకి రాలేని విషయాన్ని గుర్తు చేశారు. యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా నేటికీ ఆ ప్రాంతాలలో తాగునీటి పంపులు ఏర్పాటు చేయకపోవడంపై పంచాయతీ యంత్రాంగాన్ని నిలదీశారు. ప్రభుత్వం విడుదల చేసిన ఆసరా నగదు కొన్ని బ్యాంక్‌ల పరిధిలో డ్వాక్రా మహిళల ఖాతాల్లో జమ అవ్వలేదని తక్షణం ఆ నగదు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించండి

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి



తెనాలి రూరల్: ప్రపంచ డెంగీ దినం సందర్భంగా పట్టణాలు గ్రామాల్లో ఈ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ విస్తృత ప్రచారం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి, జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం సిబ్బందికి సూచించారు. స్థానిక వైద్యారోగ్య శాఖ అధికారి కార్యాలయం బుధవారం అసిస్టెంట్ మలేరియా అధికారులు, సబ్ యూనిట్ అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. రానున్న రోజులలో దోమల ద్వారా వ్యాప్తి చెందే డెంగ్యూ వ్యాధిని నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్ రెడ్డి, రాజు నాయక్, సబ్ యూనిట్ అధికారులు వంగల పున్నారెడ్డి, శ్రీకంత ఉమాకాంత్, ఆరోగ్య విస్తరణాధికారి అందే బాలచంద్రమౌళి, శ్రీమన్నారాయణ, చంద్రశేఖర్, సాంబయ్య, శ్రీనివాసరావు, శివ గణేష్, వెంకటప్పయ్య, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.